ఈనాడు
THE LARGEST CIRCULATED DAILY IN ANDHRA PRADESH

కర్నూలు 13-9-2009 ఆదివారం సిటీ సంపుటి 11, సంచిక 17

# కూలిన తర్వాతే పేలుడు!

- విద్రోహచర్య కాదు!
- హెలికాప్టర్ ప్రమాదంపై సీబీఐ ప్రాథమిక నిర్ధారణ
- ప్రమాదస్థలి నుంచి కొత్తగా 25 వస్తువుల స్వాధీనం
- ల్యాప్‌టాప్, పెన్‌డ్రైవ్‌లు, చిప్‌లు
- ఫోరెన్సిక్ పరీక్షలకు తరలింపు



సీబీఐ డీఐజీ లక్ష్మీనారాయణ

**కర్నూలు, న్యూస్‌టుడే:** నల్లమల ప్రమాద ఘటనలో హెలికాప్టర్ కూలిన తర్వాతే పేలుడు సంభవించిందని సీబీఐ ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చింది. హెలికాప్టర్ ప్రమాదంపై శనివారం సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. ప్రమాదస్థలిని డీఐజీ లక్ష్మీనారాయణ ఎస్పీ నాగేశ్వరరావు, ఫోరెన్సిక్ నిపుణుడు గాంధీ తదితరులు పరిశీలించారు. డీజీసీఏ బృందం గమనించని వస్తువులను సీబీఐ బృందం గమనించింది. సీబీఐ ఆధ్వర్యంలోని సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్ నిపుణులు దాదాపు 25 వస్తువులను, పరికరాలను సేకరించి సీజ్ చేశారు. మొదటిసారి శకలాలను కదుపుతూ సీబీఐ దర్యాప్తు చేపట్టింది. ఒక్కొక్కటి విడివిడిగా పరిశీలిస్తూ వెళ్లిన ఈ బృందం ఇంజిన్‌ను తిరగేసి చూడగా దాని కింద ల్యాప్‌టాప్ కన్పించింది.

వేడికి కొంతభాగం దెబ్బతిన్నా అందులో సమాచారం భద్రంగానే ఉందని భావిస్తున్నారు. ల్యాప్‌టాప్ దొరికిన చోటే రెండు పెన్‌డ్రైవ్‌లు కూడా ఉన్నాయి. వాటితో పాటు కంటి అద్దాలు, ఏటీఎం కార్డులు, సెల్‌ఫోన్ సంచులను, హెలికాప్టర్‌కు సంబంధించిన చిప్‌లు సేకరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉపయోగించే కంటి చుక్కల మందు (ఐ డ్రాప్స్) సీసా కూడా దొరికింది. శకలాలను తరలిస్తే మరిన్ని సూక్ష్మ వస్తువులను గుర్తించవచ్చని సీబీఐ అధికారులు సూచించడంతో శనివారం నుంచే ఆ కార్యక్రమం మొదలైంది. దాదాపు 120 మంది హోంగార్డులు గుట్టకు నలువైపులా శకలాలను సమీకరించే పనిలో పడ్డారు. వాటన్నింటినీ క్రోడీకరించి రాజధానికి తరలించనున్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువులను శాస్త్ర సాంకేతిక పరీక్షలు నిర్వహించడం ద్వారా పలు అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కర్నూలు నుంచి ప్రభుత్వ వాహనాల్లో గాలేరు వరకు వెళ్లిన సీబీఐ బృందం అక్కడి నుంచి ట్రాక్టర్లో పావురాల గుట్ట పాదాల వరకు చేరుకుంది. అక్కడి నుంచి కాలి నడక ద్వారా ప్రమాదస్థలికి వెళ్లారు.

ప్రమాదస్థలిలో చిరుమాను కొమ్మలు విరగడం గమనించిన అధికారులు ఆ చెట్టుపై తగులబడిన గుర్తులు లేకపోవడంతో హెలికాప్టర్ కూలిన తర్వాతే పేలుడు సంభవించినట్లు నిర్ధరించుకున్నారు. హెలికాప్టర్ తోక తొలుత చిరుమాను కొమ్మను తగిలి దిశ మారి కొండ చెట్టును బలంగా ఢీకొనడంతో కొండ చెట్టు తగలబడిందని భావిస్తున్నారు. తగలబడిన హెలికాప్టర్ శకలాలతో పాటు ఆకులను సేకరించారు. వీటిని ప్రయోగశాలలో పరీక్షించనున్నారు. ప్రమాదస్థలిలో ఆధారాల సేకరణ పూర్తవడంతో ప్రమాద కారణాలపై డీజీసీఏ బృందంతో విశ్లేషణకు సీబీఐ అధికారులు సన్నద్ధమవుతున్నారు. పోలీసులు, సీబీసీఐడీ ఇప్పటికే ఇది విద్రోహ చర్య కాదని, ఎటువంటి పేలుడు పదార్థాలను ఉపయోగించలేదని తేల్చారు. సీబీఐ కూడా వారితో ఏకీభవించింది.



హెలికాప్టర్ ప్రమాద ఘటనా స్థలంలో శకలాలను పరిశీలిస్తున్న అధికారులు